సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 24 । మార్చి । 2023



సెక్యూరిటీ సిబ్బంది చేతివాటం
ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ అనివేటి మండపాల్లో జరిగే వివాహ వేడుకల వద్ద కొందరు సెక్యూరిటీ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. 8లో ▸



నేటి నుంచి రంజాన్ దీక్షలు
ముస్లింలకు పవిత్రమైన రంజాన్ నెల ఉపవాసాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. గురువారం నెలవంక దర్శనంతో రంజాన్ నెల ప్రారంభమైంది. 8లో ▸

హోరాహోరీగా టెన్నిస్ పోటీలు
భీమవరం కాస్మో క్లబ్‌లో ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. 35+ నుంచి 75+ వరకు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.

8లో



పన్ను వసూళ్లలో జోరు

- వడ్డీ రాయితీతో చెల్లింపుల్లో వేగం
- ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం
- 'పశ్చిమ'లో భీమవరం మొదటి స్థానం
- ఉమ్మడి జిల్లాలో రూ.80.69 కోట్ల వసూలు
- మున్సిపాలిటీల్లో ప్రత్యేక డ్రైవ్


ఏలూరులోని వంగాయగూడెంలో పన్ను చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి,ఏలూరు: ఇంటి పన్నుల చెల్లింపులపై ప్రభుత్వం వడ్డీ రాయితీ కల్పించడంతో పన్ను వసూళ్లలో జోరు కనిపిస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని నగరపాలక, పురపాలక సంఘాల్లో పన్నుల చెల్లింపుల్లో దూకుడు పెరిగింది. గత ఐదేళ్లుగా వడ్డీ రాయితీ లేకపోవడంతో పన్ను వసూళ్లు మందగించాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వడ్డీ రాయితీ ప్రకటించిన వెంటనే వసూళ్లలో వేగం పెరిగింది. మున్సిపల్ రీజియన్ పరిధిలోని కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలతో పోలిస్తే పశ్చిమలో అధికంగా వసూలయ్యాయి. నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్న క్రమంలో 20 రోజుల వ్యవధిలో రూ.30 కోట్లకు పైగా పన్నులు వసూలయ్యాయి. ఏలూరు జిల్లాలో 86.76 శాతంతో జంగారెడ్డిగూడెం, పశ్చిమగోదావరి జిల్లాలో 75.04 శాతం వసూళ్లలో భీమవరం మున్సిపాలిటీలు ముందంజలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్ పరిస్థితుల దృష్ట్యా ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ రాయితీ ప్రకటించింది.

ఏలూరు జిల్లాలో..
ఏలూరు నగరపాలక సంస్థతో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్ల కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ప్రధానంగా ఆస్తి పన్ను, ప్రభుత్వ కార్యాలయాల పన్ను, ఖాళీ స్థలాల పన్ను, వాటర్ ట్యాక్స్ పన్నులు వసూలు చేస్తున్నారు. ఏలూరు కార్పొరేషన్‌లో రూ.24.73 కోట్లు వసూలయ్యాయి. ఏలూరులో 65,717 ప్రైవేట్ అసెస్‌మెంట్లు, 214 ప్రభుత్వ కార్యాలయాలు, 690 ఖాళీ స్థలాలు, 26,786 కుళాయి కనెక్షన్లకు పన్ను వసూలు చేయాల్సి ఉంది. మున్సిపాలిటీల వారీగా నూజివీడులో రూ.3.23 కోట్లు, చింతలపూడిలో రూ.1.44 కోట్లు, జంగారెడ్డిగూడెంలో రూ.6.16 కోట్ల పన్ను వసూలయ్యాయి. ఏలూరు జిల్లాలో మొత్తంగా 74.25 శాతం మేర పన్ను వసూలు కాగా జంగారెడ్డిగూడెంలో అత్యధికంగా 86.76 శాతం వసూలయ్యాయి. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పన్ను వసూళ్లలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రథమ, ఉమ్మడి కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లో రెండో స్థానంలో నిలిచింది.

'పశ్చిమ'లో రూ.45.13 కోట్లకుపైగా..
పశ్చిమగోదావరి జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఇప్పటికే 73.64 శాతం పన్ను వసూళ్లు పూర్తయ్యాయి. భీమవరం 75.04 శాతం వసూళ్లతో జిల్లాలో అగ్రస్థానంలో నిలిచింది. జిల్లాలో మున్సిపాలిటీల వారీగా భీమవరంలో రూ.16.02 కోట్లు, తణుకులో రూ.8.95 కోట్లు, పాలకొల్లులో రూ.4.95 కోట్లు, తాడేపల్లిగూడెంలో రూ.9.59 కోట్లు, ఆకివీడులో రూ.1.08 కోట్లు, నరసాపురంలో రూ.3.82 కోట్లు వసూలయ్యాయి. మొత్తంగా జిల్లాలో రూ.45.13 కోట్లు వసూలు చేశారు. రీజియన్ పరిధిలో గత సోమవారం రూ.5 కోట్లు, మంగళవారం రూ.4 కోట్ల మేర పన్నులు వసూలయ్యాయి.

మున్సిపాలిటీల్లో ముమ్మరంగా..

ప్రజలపై ఆర్థిక భారం తగ్గించడానికి పెండింగ్ బకాయిలు, ప్రస్తుత బకాయిలతో ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించింది. దీంతో మున్సిపాల్టీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నుల వసూళ్లు వేగవంతం చేశాం. రెండు రోజుల్లో రీజియన్ పరిధిలో రూ.9 కోట్లకుపైగా వసూలు చేశాం.
– ఎంవీవీ సత్యనారాయణరావు, మున్సిపల్ ఆర్డీ

క్రీడా కెరటాలు ఉద్యాన విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ జానకిరామ్

తాడేపల్లిగూడెం: హర్యానాలోని హిస్సార్‌లో జరిగిన 21వ అఖిల భారత వ్యవసాయ విశ్వవిద్యాలయాల జాతీయస్థాయి క్రీడా పోటీలు, బెంగళూరులో జరిగిన కల్చరల్ ఫెస్టులో ప్రతిభ చూపి బహుమతులు సాధించిన విద్యార్థులను గురువారం వెంకట్రామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ ఉప కులపతి తోలేటి జానకిరామ్ ప్రత్యేకంగా అభినందించారు. 67 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్న పోటీల్లో ఉద్యాన విద్యార్థులు నాలుగో స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పోటీతత్వంతో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. ఉద్యాన కళాశాల ఇన్‌చార్జి అధ్యాపకులు దివ్య అనిత, ఫిజికల్ డైరెక్టర్ రాంబాబుకు అభినందనలు తెలిపారు. వర్సిటీ అధికారులు బి.శ్రీనివాసులు, పద్మావతమ్మ, నారం నాయుడు, సలోమిసునీత, సూర్యకుమారి, కరుణశ్రీ, వెంకటస్వామి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

పాలకొల్లు అర్బన్: జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో లంకలకోడేరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన 'గ్రామీణ బాలల సంరక్షణ' (బేబీ కేర్ సెంటర్) ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జీబీజె ప్రసాదరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 9వ తరగతి చదివే విద్యార్థులకు ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన వ్యవస్థాపకత మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈనెల 21న భీమవరంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించిందని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో తమ విద్యార్థులు కామన గీతిక, వాసా నందిని, వీరా నందిని గైడ్ టీచర్ తోలేటి సుధీర్ సహకారంతో ప్రాజెక్టు రూపొందించారన్నారు. ఈనెల 28న అమరావతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలో వచ్చేనెల 3 నుంచి 18 వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతిస్తామని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా బస్సులను నడుపుతామని, హాల్‌టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. ఈ మేరకు ఉత్తర్వులను జిల్లాలోని అన్ని డిపోలకు పంపిచామన్నారు.

సాంకేతికతతో అధిక లాభాలు


డ్రోన్ స్ప్రేయర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉండి: వరిసాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అధిక లాభాలు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పెదపుల్లేరులో కృషీవిజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని పది మంది రైతులకు చెందిన 20 ఎకరాల్లో డ్రోన్ సాయంతో స్ప్రే చేశారు. అనంతరం వ్యవసాయాధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంలో సాంకేతికతను అందుబాటులోకి తీసుకువస్తోందని, డ్రోన్‌లను రాయితీపై అందిస్తున్నారన్నారు. ఐదుగురు సభ్యులు రైతు సంఘంగా ఏర్పడితే 40 శాతం సబ్సిడీ, బ్యాంకు రుణం 50 శాతం అందిస్తారని, రైతులు కేవలం 10 శాతం వాటాతో డ్రోన్‌ను పొందవచ్చన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కె.మల్లికార్జునరావు, కె.రాజేష్, ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాస్, ఏఓ పి.సంధ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఏలూరు అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ ఎ.పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని స్థానిక 18 డివిజన్ బాప్టిస్ట్‌పేట, 36వ డివిజన్ ఆర్‌ఆర్‌పేట-1, 20వ డివిజన్ పరిధిలోని రామకృష్ణాపురం కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, 49వ డివిజన్ గవర్లపేట, 20వ డివిజన్ ఎన్‌ఆర్ పేట, 31వ డివిజన్ పరిధిలోని పత్తేబాద02 కేంద్రాల్లో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. స్థానికులైన వివాహిత మహిళలు మాత్రమే అర్హులని, వయసు గతేడాది జూలై 1 నాటికి 21 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. కనీస విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలోపు ఏఎస్‌ఆర్ స్టేడియం వెనుక ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో.. బీసీ నేత జయమంగళకు పట్టం

- కొల్లేరు నుంచి తొలి ఎమ్మెల్సీగా ఎన్నిక
- జెడ్పీటీసీ నుంచి రాజకీయ ప్రస్థానం
- బలహీనవర్గాలకు వైఎస్సార్ సీపీ ప్రాధాన్యం


జయమంగళ వెంకటరమణ

సాక్షిప్రతినిధి, ఏలూరు: టీడీపీలో అనేక అవమానాలకు గురి చేశారు.. వెన్నుపోట్లు పొడిచారు.. అయినా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి బీసీలకు మేలు చేయాలని.. కొల్లేరు ప్రాంత అభివృద్ధి పాటుపడాలన్న ఆయన సంకల్పంతో శాసనమండలి సభ్యత్వం వరించింది. కొల్లేరు ప్రాంతంలో బలమైన బీసీ నేతగా గుర్తింపు ఉన్న జయమంగళ వెంకటరమణను వైఎస్సార్ సీపీలోకి చేర్చుకుని వెంటనే శాసన సభ్యుల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తారని అధికార వైఎస్సార్ సీపీ ప్రకటించింది. దానికనుగుణంగా ఎమ్మెల్సీ టిక్కెట్ ఇచ్చి ఎన్నికల్లో ఘన విజయం సాధించేలా చేసి బలహీనవర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తామని వైఎస్సార్ సీపీ మరోసారి నిరూపించింది. గురువారం శాసన సభలో జరిగిన శాసనమండలి సభ్యుల ఎన్నికల్లో ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ ఘన విజయం సాధించారు. జెడ్పీటీసీగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం శాసనమండలి సభ్యుడి స్థాయికి చేరింది.

చరిత్ర సృష్టిస్తూ..
కొల్లేరు ప్రాంతం నుంచి శాసనమండలి సభ్యునిగా ఎన్నికైన మొదటి వ్యక్తిగా జయమంగళ చరిత్ర సృష్టించారు. క్షేత్రస్థాయిలో కొల్లేరు ప్రాంత ప్రజల స్థితిగతులపై సమగ్ర అవగాహనతో పాటు అదే సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో రెండు దశాబ్దాలుగా రాజకీయాలకు అతీతంగా కొల్లేరు ప్రజల పక్షాన నిలిచారు. ఇదే ఆయన రాజకీయానికి పునాది అయ్యింది. 2001 నుంచి 2006 వరకు జెడ్పీటీసీగా పని చేసి కొల్లేరు సమస్యలపై నిరంతరం మాట్లాడేవారు. 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందినా.. 2014 ఎన్నికల్లో టికెట్ ఇచ్చినట్టు ఇచ్చి పొత్తుల పేరుతో మళ్లీ టికెట్ మార్చి అవమానించారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో మళ్లీ చివరి నిమిషంలో టీడీపీ టికెట్ ఇచ్చినా ఆ పార్టీ నాయకుల వెన్నుపోట్లతోనే ఓడిపోయారు. అయినప్పటికీ నియోజకవర్గంలో పనిచేస్తున్నా నిరంతరం పార్టీపరంగా వేధింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో అధికార వైఎస్సార్ సీపీలోకి జయమంగళ చేరారు.

కొల్లేరు ప్రజలకు న్యాయం చేయాలనే తలంపుతో జయమంగళ వెంకటరమణను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. జయమంగళను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ ముదునూరు ప్రసాదరాజు, వైఎస్సార్ సీపీ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల అధ్యక్షులు ఆళ్ల నాని, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, జిల్లాలోని ప్రజాప్రతినిధులు అభినందించారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు


సభా ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి


దెందులూరులో ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ

- 25న సీఎం జగన్ రాక
- దెందులూరులో చురుగ్గా పనులు

దెందులూరు/ఏలూరు టౌన్: దెందులూరులో వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి ఈనెల 25న (శనివారం) ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గురువారం దెందులూరులో సభా ప్రాంగణం తదితర ఏర్పాట్లను సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ, పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హెలీప్యాడ్ వద్ద సీఎంకు స్వాగతం పలకడానికి వచ్చిన మంత్రులు, వీఐపీలు వేచి ఉండేందుకు, తిరుగు ప్రయాణంలో స్థానిక ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి ముచ్చటిస్తారని ఇందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలన్నారు. హెలీప్యాడ్ నుంచి సభావేదిక వరకు రెండు మార్గాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. దెందులూరు మల్కాపురం సమీపంలో సభావేదిక వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు.

పకడ్బందీగా బందోబస్తు
పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నామని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ అన్నారు. హెలీప్యాడ్, సభా స్థలం, పార్కింగ్, ట్రాఫిక్ అంశాల్లో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రతిచోటా ఒక అదనపు ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకున్నామని ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ అన్నారు.

ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు అధికారులు, సిబ్బందిని భారీగా మోహరిస్తున్నామని తెలిపారు. అవాంఛనీయ సంఘనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఉంటుందన్నారు. ఇతర జిల్లాల నుంచి పోలీసు బలగాలను నియమించారని, ఒకరోజు ముందుగానే వారంతా కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. వారి వెంట ఎస్‌బీ సీఐ వి.రవికుమార్, పెదవేగి సీఐ ఎస్.దుర్గాప్రసాద్, ఎస్సైలు వీర్రాజు, లక్ష్మణ్, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పోషణ.. ఆరోగ్య సంరక్షణ

- వచ్చేనెల 3 వరకు పోషణ పక్షోత్సవాలు
- పోషకాహార ఆవశ్యతను తెలిపేలా కార్యక్రమాలు
- 25న 2కేరన్.. 31న గృహ సందర్శన



పోడూరులో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం, పోషకాహారం

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజారోగ్యమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ప్రజల ఆరోగ్య సంరక్షణతో పాటు వారికి పోషకాహారం అందించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. చంటి బిడ్డల దగ్గర నుంచి వృద్ధుల వరకూ అందరి ఆరోగ్య రక్షణకు పలు పథకాలను అమలు చేస్తోంది. దీనిలో భాగంగా ఐసీడీఎస్, వైద్యశాఖల ఆధ్వర్యంలో సంపూర్ణ పోషకాహారంపై అవగాహన కల్పించేలా ఈనెల 20 నుంచి వచ్చేనెల 3 వరకు పోషణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పక్షోత్సవాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గ్రామాల్లోనూ పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

చురుగ్గా పక్షోత్సవాలు

జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు చురుగ్గా సాగుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం రోజు వారీ కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే నెల 3 వరకు పోషకాహారంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.
– సుజాతరాణి, పీడీ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, భీమవరం

కార్యక్రమాలు ఇలా..

- **24న గ్రోత్ మోనిటరింగ్**
ఆరేళ్ల కంటే ఎక్కువ వయసున్న పిల్లల బరువు, ఎత్తు కొలవడం, పోషకాహారలోపం ఉన్న పిల్లల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- **25న 2కేరన్**
25న మిల్లెట్ ఆధారిత ఆహార పదార్థాలపై దృష్టి సారించి ఆరోగ్యం, పోషకాహారం ప్రాముఖ్యతపై జిల్లాలో 2కే రన్ నిర్వహిస్తారు.
- **27న విద్యార్థులకు పోటీలు**
పోషకాహార ప్రాముఖ్యతపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. కిశోర బాలికలకు రక్తహీనత నివారణ, రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారంపై సదస్సులు నిర్వహిస్తారు.
- **29న డైట్ శిబిరాలు**
గర్భిణులు, పాలిచ్చే తల్లుల కోసం పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, డీహెచ్‌సీ వద్ద డైట్ కన్సల్టేషన్ శిబిరాలు నిర్వహిస్తారు.
- **30న వంటల పోటీలు**
మిల్లెట్ ఆధారిత సంప్రదాయ ఆరోగ్యకరమైన ఆహార వంట, సంప్రదాయ ఆరోగ్యకరమైన వంటకం పోటీలను నిర్వహిస్తారు.
- **31న గృహ సందర్శన**
ఏఎన్‌ఎం, ఆశ, ఏఎస్‌డబ్ల్యూ, హెల్త్ సబ్ కమిటీ సభ్యులు, వీవోఎస్ తదితరులు ఇంటింటికీ వెళ్లి పిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు పరీక్షలు చేసి సలహాలు ఇస్తారు.
- **1న శిక్షణ**
తల్లులకు అవగాహన కల్పించేలా న్యూట్రిగార్డెన్‌లకు ఎక్స్‌పోజర్ సందర్శన నిర్వహిస్తారు. మిల్లెట్ ఆధారిత వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇస్తారు.
- **3న ముగింపు వేడుక**
ముగింపు వేడుకల్లో భాగంగా ఏడబ్ల్యూసీలో హెల్తీబేబీ షో నిర్వహిస్తారు. అన్ని పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తారు.

ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే వాసుబాబు



గణపవరం: ఆక్వా జోన్‌తో సంబంధం లేకుండా ఆక్వా సాగుచేసే రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని ఏలూరు జిల్లా ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన అసెంబ్లీలో ఆక్వా సమస్యలతో పాటు ఇతర ప్రభుత్వ పథకాల గురించి జరిగిన చర్చలో మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా సాగు అధికంగా ఉందని, ఏడాది కాలంగా ఆక్వా సాగు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, చాలా మంది రైతులు నష్టాల్లో ఉన్నారని వాసుబాబు చెప్పారు. ప్రభుత్వం ఆక్వా జోన్ ఏర్పాటుచేసి ఐదెకరాలలోపు ఉన్న రైతులకు విద్యుత్ సబ్సిడీ వర్తింపచేస్తుందన్నారు. గతేడాది గణపవరం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఐదెకరాల పరిమితిని తొలగించాలని తాను విజ్ఞప్తి చేయగా, ఆయన సభాముఖంగా పదెకరాల రైతులకు కూడా విద్యుత్ సబ్సిడీ ఇస్తున్నట్టు ప్రకటించారని గుర్తుచేశారు. ఈ సబ్సిడీ ఆక్వా జోన్‌లో ఉన్న రైతులకు మాత్రమే వర్తింపజేస్తున్నారని, ఆక్వా సాగులో ఒడిదుడుకులను దృష్ట్యా ఈ నిబంధనను తొలగించాలని కోరారు.

కారుమబ్బులు కమ్మిన వేళ..


మూడు రోజులుగా వాతావరణంలో మార్పుతో కొద్దిసేపు మబ్బులు.. మరి కొద్దిసేపు ఎండ కనిపిస్తోంది. ఒక్కోసారి దట్టమైన మబ్బులు కమ్ముకుని వాన పడుతుందేమో అనిపిస్తోంది. అచ్చం ఇలాగే.. ఏలూరు శివారు సోమవరప్పాడు జాతీయ రహదారిపై గురువారం ఒక్కసారిగా కారుమబ్బులు కమ్మిన దృశ్యమిది.
– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

క్లుప్తంగా

సోనోవిజన్ డ్రా విజేతలు వీరే



సోనోవిజన్ లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటిస్తున్న ఎస్ఎంఆర్ పెదబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సోనోవిజన్ షోరూంలో ఉగాది సందర్భంగా డిస్కౌంట్ సేల్ నిర్వహించి లక్కీ డ్రాలో విజేతలకు కారు, టీవీ, వాషింగ్ మెషీన్ వంటి బహుమతులు అందిస్తామని ప్రకటించామని, దీనికి వినియోగదారుల నుంచి విశేషమైన స్పందన లభించిందని సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ పీ.భాస్కర మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం షోరూంలో నిర్వహించిన లక్కీ డ్రాలో ఏలూరు నగర పాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు ముఖ్య అతిథిగా పాల్గొని డ్రా తీసి విజేతలను ప్రకటించారు. లక్కీ డ్రాలో తంగెళ్ళమూడికి చెందిన టీ.సావిత్రి మారుతీ కారును గెలుచుకోగా, ఏలూరుకు చెందిన శ్రీనివాసరావు ఎల్ఈడీ టీవీ, తడికలపూడికి చెందిన వై.శ్రీదుర్గ ఫ్రిజ్, సింగవరానికి చెందిన ఎస్.శ్రీనివాసరావు వాషింగ్ మెషీన్ గెలుపొందారు. ఈ సందర్భంగా భాస్కరమూర్తి మాట్లాడుతూ అందరికన్నా తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీసు అందిస్తున్న రాష్ట్రంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్ స్టోర్ తమ సోనోవిజన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రాంప్రసాద్, గుడివాడ మాజీ డిప్యూటీ మేయర్ రామచంద్ర కిషోర్ పాల్గొన్నారు.

26న కాకినాడలో బాడీ బిల్డింగ్ పోటీలు

సాక్షి, భీమవరం: ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న కాకినాడలో జోన్ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా బాడీబిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి రమేష్‌కుమార్, ఇన్‌చార్జ్ కార్యదర్శి షేక్ ఖాసి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడలోని విల్సన్ జిమ్ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు సుమారు 150 మంది బాడీబిల్డర్స్ పాల్గొంటారని పోటీల్లో విజేతలకు చాంపియన్ ఆఫ్ చాంపియన్‌కు రూ.30 వేలు, రన్నరప్‌కు రూ.20 వేలు, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా నగదుతోపాటు జ్ఞాపికలను అందచేస్తారన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

చింతలపూడి: ముస్లింలకు అతి పవిత్రమైన రంజాన్ నెల ఉపవాసాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. గురువారం నెలవంక దర్శనంతో రంజాన్ నెల ప్రారంభమైంది. ప్రస్తుతం కోవిడ్ ప్రభావం అంతగా లేకపోయినా తగిన జాగ్రత్తలు పాటిస్తూ నమాజులు చేసుకోవాలని సీఐ నాగ మల్లేశ్వరరావు ముస్లిం సోదరులకు విజ్ఞప్తి చేశారు. ఖురాన్ ప్రకారం రంజాన్ నెలలో విధిగా ఉపవాస వ్రతాన్ని పాటిస్తారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. రంజాన్ నెల ముస్లిం విశ్వాసుల పండుగ. అభిమానానికి, స్నేహానికి ప్రతీకగా దీనిని ఆచరిస్తారు. ముస్లింలు క్రమశిక్షణ, దాతత్వం, ధార్మిక చింతనతో అల్లాహ్‌ను ప్రార్థిస్తారు. జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు తదితర పట్టణాల్లో రంజాన్ పండుగను ముస్లింలు ఏటా ఘనంగా జరుపుకుంటారు.

రంజాన్ ప్రత్యేకత

రంజాన్ మాసం ప్రారంభమైన నాటి నుంచి ముగిసే వరకు ముస్లింలు పగలు ఉపవాస దీక్షలను(రోజా) పాటిస్తారు. కేవలం ఆహార పానీయాలను మానేయడం మాత్రమే రోజా కాదు. నిష్ఠ, నియమాలతో కూడుకున్న జీవన విధానాన్ని ఆచరిస్తారు. తెల్లవారు జామున ఆహారం తీసుకోవడాన్ని సహర్ అని, సాయంత్రం ఉపవాస దీక్ష విరమణలో తీసుకునే ఆహారాన్ని ఇఫ్తార్ అని అంటారు. ఇలా ప్రతీ రోజు సుమారు 13 గంటలపాటు కఠిన ఉపవాస దీక్షను అవలంభిస్తారు.



రంజాన్ ఉపవాసాల కోసం ముస్తాబయిన చింతలపూడి జామియా మసీదు

షబ్–ఎ–ఖద్ర్

రంజాన్ నెల ప్రారంభమైన 27 వ రోజు షబ్–ఎ–ఖద్ర్ ను ముస్లింలు జరుపుకుంటారు. ఈ రోజున దివ్య ఖురాన్ అవతరించిందని ముస్లింల విశ్వాసం. ఈ రోజున రాత్రంతా జాగరణ చేసి ప్రార్థనలతో గడుపుతారు. ఆ రాత్రి భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేసిన వారికి ఎన్నో సంవత్సరాల పాటు ప్రార్థనలు చేస్తే వచ్చే పుణ్యం దక్కుతుందని విశ్వాసం.

జకాత్

దైవ ప్రసన్నత పొందడానికి సంపదలో కొంత మొత్తాన్ని పేదలకు అందించడమే జకాత్ ముఖ్య ఉద్దేశ్యం. రంజాన్ నెలలోనే ముస్లింలు విధిగా జకాత్ చెల్లిస్తారు. పేద, ధనిక అంతరాలను రూపుమాపడానికి జకాత్ తోడ్పడుతుందని నమ్ముతారు. జకాత్ అంటే పరిశుద్ధ పరిచేదని అర్థం. జకాత్ చెల్లించడంతో పాటు పండుగ జరుపుకునే ముందు పేదలకు దానం(ఫిత్రా) చేస్తారు. కుటుంబంలో ఎంత మంది సభ్యులు ఉంటే అందరి తరుపున విధిగా ఫిత్రా చెల్లిస్తారు. ఒక్కో ఫిత్రా కింద రెండున్నర కిలోల ఆహార ధాన్యాలు, లేదా అందుకు సమానమైన నగదు చెల్లించాలి.

హలీద

ప్రతీ దినం ఇఫ్తార్ సమయంలో సేవించే హలీద(జావ)కు కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి. మసాలా దినుసులతో పాటు ప్రత్యేక ఆహార పదార్థాలతో దీన్ని తయారు చేస్తారు. బొంబాయి రవ్వ, బియ్యం రవ్వ, మేక మాంసం తదితర పదార్థాలను కలిపి జావ తయారు చేస్తారు. దీనిని మట్టి పాత్రలలో సేవిస్తారు.

షవ్వాల్

ఈ విధంగా నెల అంతా పవిత్ర కార్యక్రమాలతో సాగిన ఉపవాస వ్రత దీక్ష ...షవ్వాల్ నెలవంక ప్రత్యక్షమవగానే ముస్లిం సోదరులు విరమించి, మరుసటి రోజున పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. షవ్వాల్ నెల మొదటి రోజున జరుపుకునే పండుగను ఈదుల్ ఫితర్ అని అంటారు.

దైవభీతిని కలుగ చేస్తుంది



ఉపవాసం మనిషిలో దైవ భీతిని కలుగ చేస్తుంది. అల్లాహ్‌కు వినమ్రంగా మారుస్తుంది. కోరికలకు కళ్లెం వేస్తుంది. ఉపవాసం ఉండే మనిషికి మనసు మీద నియంత్రణ సులువవుతుంది. ఆరోగ్యంతో పాటు ఇతరుల పట్ల సోదర భావం పెరుగుతుంది. ఆకలితో ఉన్న వారు, అవసరాలతో ఉన్న వారి పట్ల దయా భావం పెరుగుతుంది.

– మహమ్మద్ అబ్దుల్ వదూద్, జామియ మసీదు ఇమామ్

27న ఈపీఎఫ్ఓ అవుట్‌రీచ్ ప్రోగ్రాం

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగులు భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్ కే నికత్–జిల్లా అవుట్‌రీచ్ ప్రోగ్రాం జరగనుంది. పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల ఖాతాదారులు ఈ సేవలు వినియోగించుకోవచ్చన్నారు. భవిష్య నిధి అంతిమ ఉపసంహరణ, ఖాతాల బదిలీ తదితర అంశాలకు సంబంధించి పరిష్కరిస్తామన్నారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పెద్దాపురంలో శ్రీలలితా ఎంటర్‌ప్రైజస్ ఇండస్ట్రీస్(ప్రై)లిమిటెడ్ ఆవరణలోను, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం వేదాంత లిమిటెడ్ ఆవరణలో, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ రిసోర్స్ సెంటర్ ఆవరణలో, కాకినాడ జిల్లా పరిధిలో కాకినాడ ఈపీఎఫ్ఓ జిల్లా కార్యాలయంలో, ఏలూరు జిల్లా పరిధిలో ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అటానమస్ కాలేజ్ ఆడియో విజువల్ హాల్‌లో, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో భీమవరం ఈపీఎఫ్ఓ జిల్లా కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో పెన్షన్ అర్హత, లెక్కించడం, క్లెయిమ్, ఉపసంహరణ, స్కీమ్ సర్టిఫికెట్, ఈ–నామినేషన్, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ తదితర సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

హోరాహోరీగా టెన్నిస్ పోటీలు



భీమవరంలో టెన్నిస్ పోటీల దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం కాస్మో క్లబ్‌లో నిర్వహిస్తున్న ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పోటీలను క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లూరి పద్మరాజు, పి.వెంకట రామరాజు, వీవీఎస్ఎస్ వర్మ, కె.రాంబాబు పర్యవేక్షించారు. 35 ప్లస్ సింగిల్స్ ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో వి.రామకృష్ణపై ఎన్‌డీ విజయ్ ఆనంద్ విజయం సాధించారు. డాక్టర్ జాన్ రెజినాల్డ్ పై కె.రవికుమార్, కెఎస్ఎన్ రాజుపై కె.సంపత్ కుమార్, వై.శ్రీనివాసరెడ్డిపై షానర్ నాయుడు, టి.దత్తుపై ఐ.గిరీష్‌కుమార్ రెడ్డి, భాస్కరరావుపై విజయ్ వర్మ, పి.సుభాష్‌పై పట్నాయక్, కబీర్ నునావత్‌పై నగేష్ విజయం సాధించారు. 45 ప్లస్ సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో సి.సుబ్రహ్మణ్యంపై మణికందన్ గెలుపొందారు. ఎస్‌కే సలీంపై జీవీ రమణ, ఎం.భాస్కర్ నాయుడుపై ఎవీఎల్ఎన్ రాజు, నాగరాజుపై పి.సుధీర్ రెడ్డి, ఆర్ నాగరాజుపై సుబ్రహ్మణియన్, ఆర్ఎం కుమార్‌పై బాబు రాజా, జి.వెంకటేశ్వర్లుపై మణికన్నె, ఆర్.రాంబాబుపై ఎంఎస్ కిరణ్ గెలుపొందారు. 55 ప్లస్ సింగిల్స్ ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో ఎ.గజేంద్రనాయుడుపై వి.శ్రీనివాసరెడ్డి విజయం సాధించారు. కె.ఎన్.కేశవ ప్రసాద్‌పై బి.జి.నగేష్, జి.కన్నన్‌పై ఎ.వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ రాత్‌పై హేమంత్ కుమార్, చిన్ని సుధాకర్‌పై సుధాకర్‌రెడ్డి, ఎం.మోహిత్ కుమార్ రాజరాంపై సన్యాసి బెసార్త్, కె.పి.రావుపై ఎస్.చంద్రశేఖరరావు, డాక్టర్ శంకర్ రెడ్డిపై ఆర్ఎస్ రావత్ విజయం సాధించారు. 65 ప్లస్ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఎం.జోయల్ కుమార్‌పై సేతు, సి.విజయ్‌కుమార్‌పై సన్యాసి రాజు, రజాక్‌పై వి.ధనుంజయులు, పాలచంద్రపై తులసీ రాం గెలుపొందారు. 75 ప్లస్ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో పి.కె. బాబాపై కె.రాధా కృష్ణమూర్తి, ఎం.సాయి రాంబాబుపై అశోక్ రెడ్డి, బీవీ మంజునాథ్‌పై పి.కె.పట్నాయక్ విజయం సాధించారు.

సెక్యూరిటీ సిబ్బంది చేతివాటం


శ్రీవారి ఆలయంలో బయటపడ్డ అక్రమాలు



ద్వారకాతిరుమల : శ్రీవారి ఆలయ అనివేటి మండపాల్లో జరిగే వివాహాల టికెట్ల విక్రయాల్లో కొందరు సెక్యూరిటీ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. గురువారం ఒక భక్తుడి ఫిర్యాదుతో అసలు విషయాలు బట్టబయలయ్యాయి. ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు విచారణ చేపట్టారు. చినవెంకన్న ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని అనివేటి మండప సముదాయంలోని 40 కల్యాణ మండపాల్లో నిత్యం వివాహాది శుభకార్యాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే చాలు వాటికి మంచి డిమాండ్ ఏర్పడుతుంది. అదే కొందరు సెక్యూరిటీ సిబ్బందికి కాసులు కురిపిస్తోంది. శుభకార్యాలు జరుపుకునే వారు ఒక్కో మండపానికి రూ. 1000, వివాహ టికెట్‌కు రూ. 500, వీడియో తీసుకునేందుకు రూ. 500 చెల్లించాల్సి ఉంటుంది. మండపాన్ని ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు గాని, వివాహ టికెట్, వీడియో టికెట్‌లను మాత్రం అదేరోజు నగదు చెల్లించి తీసుకోవాల్సి ఉంటుంది. ఇదే అదనుగా వివాహ టికెట్, వీడియో టికెట్‌లు తీసుకోవాలన్న విషయం తెలియకో.. లేక హడావుడిలోనో వాటిని ఎక్కువ మంది పొందడం లేదు. అదే అదనుగా వివాహాలు జరిగే సమయంలో తనిఖీలు పేరుతో వెళుతున్న కొందరు దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది టికెట్లు లేకుంటే శుభకార్యం జరుపుకోవడం కుదరదని, ఉన్నపళంగా టికెట్లు చూపాలని, లేకుంటే తమకు నగదు ఇస్తే టికెట్లు తీసుకొస్తామని చెప్పి పెళ్లి టికెట్‌కు రూ. 500, వీడియో టికెట్‌కు రూ. 500 వెరసి రూ. 1000 వారి జేబులో వేసుకుంటున్నారు.

బట్టబయలైంది ఇలా..

ఈ నెల 15న ఏలూరుకు చెందిన భక్తుడు అనివేటి మండపం 11వ నంబర్ కల్యాణ మండపంలో వివాహం చేసుకున్నాడు. ఆ సమయంలో ఒక సెక్యూరిటీ గార్డు వివాహం టికెట్, వీడియో టికెట్ నిమిత్తం వారి నుంచి రూ.1000 తీసుకున్నాడు. సదరు భక్తుడు గురువారం దేవస్థానానికి వచ్చి వివాహ రిజిస్ట్రేషన్‌కు సచివాలయంలో మ్యారేజ్ టికెట్ కావాలంటున్నారని, అది ఇప్పించాలని కోరాడు. టికెట్ ఆ రోజే తీసుకోవాలని, ఇప్పుడు కుదరదని సంబంధిత సిబ్బంది చెప్పడంతో, దేవస్థానం సెక్యూరిటీ గార్డు తమ వద్ద టికెట్ల నిమిత్తం రూ.1000 తీసుకున్నాడని, హడావుడిలో టికెట్లు అడగలేదని ఆ భక్తుడు చెప్పి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఈఓను వివరణ కోరగా పూర్తి స్థాయి విచారణ జరిపి, సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.



గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆలయ రికార్డులు తగులబెట్టిన ఆగంతకులు



గొల్లపల్లి ఆలయంలో తగులబెట్టిన రికార్డులు

నూజివీడు: మండలంలోని దేవదాయ శాఖకు చెందిన గొల్లపల్లిలోని శ్రీరఘునాథస్వామి ఆలయ రికార్డులను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి తగులబెట్టారు. ఆలయంలోని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆఫీసు తాళాలు పగులగొట్టి తలుపులు తీసి రికార్డులు కాల్చివేయడమే కాకుండా, కంప్యూటర్‌లను సైతం ధ్వంసం చేశారు. దీనిపై ఆలయ ఈవో విశ్వేశ్వరరావు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ, రూరల్ సీఐ ఆర్.అంకబాబుతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆలయంలోని సీసీ ఫుటేజీని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్‌టీం సైతం వచ్చి ఆధారాలు సేకరించింది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 21న శ్రీరామనవమి ఏర్పాట్లకు సంబంధించిన టెండర్లను ఆలయ అధికారులు రద్దు చేసి షార్ట్ టెండర్లు పిలిచారు. ఈ షార్ట్ టెండర్ల గడువు 23వ తేదీ సాయంత్రం 5గంటల కల్లా ముగిసింది. ఈ నేపథ్యంలో 22వ తేదీ అర్ధరాత్రి రికార్డులను తగులబెట్టడం గమనర్హం.

అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి

దెందులూరు: మండలంలోని సానిగూడెంలో అనుమానాస్పద స్థితిలో గర్భిణి జంగం భువనేశ్వరి(23) మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగులగూడెం గ్రామానికి చెందిన భువనేశ్వరి, సానిగూడెం గ్రామానికి చెందిన జంగం ఫణి రెండేళ్ళ క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. వారికి ఒక బాబు. ప్రస్తుతం భువనేశ్వరి గర్భిణి. పెళ్లైన ఒక సంవత్సరం అలుగులగూడెం అత్తవారింటిలో ఫణి, భువనేశ్వరి ఉన్నారు. సోమవారం భార్య భువనేశ్వరిని భర్త ఫణి అత్తమామల ఇంటికి తీసుకువెళ్ళాడు. బుధవారం భువనేశ్వరి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న భువనేశ్వరి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు భర్త కుటుంబ సభ్యులపై దాడి చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనపై విచారణ జరిపించాలని, భువనేశ్వరిది సహజమరణం కాదని బంధువులు, గ్రామస్తులు ఏలూరు వైద్యశాలలో ధర్నా నిర్వహించారు.

సెల్ టవర్‌లో బ్యాటరీలు చోరీ

సాక్షి, భీమవరం: సెల్ టవర్‌లో బ్యాటరీలు పోయాయంటూ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ బి.రాజు గురువారం తెలిపారు. భీమవరం పట్టణం గాంధీ నగర్‌లోని రిలయన్స్ సెల్ టవర్‌లో 5 బ్యాటరీలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారంటూ ఎస్టేట్ అధికారి జి.రామచంద్ర చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాజు చెప్పారు.

ఇంటర్ పరీక్షలకు 31,421 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ థియరీ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన గణితం పేపర్–1బీ, జువాలజీ -1, హిస్టరీ -1 పరీక్షలకు కేటాయించిన 106 కేంద్రాల్లో మొత్తం 33,060 మంది విద్యార్థులకు 31,421 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 10,420 మంది జనరల్ విద్యార్థులకు 10,002 మంది హాజరయ్యారు. 2006 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1679 మంది హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 14,308 మంది జనరల్ విద్యార్థులకు గాను 13,888 మంది హాజరయ్యారు. 1723 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1507 మంది హాజరయ్యారు. తూర్పు గోదావరి జిల్లాలో 15 కేంద్రాల్లో 3722 మంది జనరల్ విద్యార్థులకు 3,582 మంది హాజరయ్యారు. 881 ఒకేషనల్ విద్యార్థులకు 763 మంది హాజరు కాగా 118 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద విద్యార్థుల హాజరు 95 శాతంగా నమోదైంది. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.చంద్రశేఖర బాబు తెలిపారు.

రైతులకు న్యాయం చేయాలని వినతి



చింతలపూడి మార్కెట్ కమిటీ ఆవరణలో జరిగిన సమావేశానికి హాజరైన ఎత్తిపోతల పథకం రైతు సంఘం నాయకులు

చింతలపూడి: చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో భూములు కోల్పోయిన రైతుల సమావేశం గురువారం జరిగింది. ఈ నెల 25న దెందులూరు నియోజకవర్గానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలు చెప్పుకోవాలని రైతులు భావిస్తున్నారు. ఈ మేరకు రైతులకు ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇప్పారని రైతు నాయకులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువను ఆధారం చేసుకుని రైతులకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం పథకానికి నిధులు కేటాయించక పోవడంతో పాటు రైతుల పరిహారం సమస్యను పట్టించుకోకపోవడంతో ఏళ్ళ తరబడి పనులు నత్తనడకన సాగాయి. ప్రస్తుత ప్రభుత్వం బడ్జెట్లో ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. నష్ట పరిహారం విషయం ఇంత వరకు తేలక పోవడమే ఇందుకు ప్రధాన కారణంగా రైతులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని రైతు సంఘం అధ్యక్షుడు రంగరాజు, నాయకులు సీహెచ్ అంజిబాబు, గోలి రామకృష్ణారెడ్డి, బాబ్జి, బొల్లిన పుల్లారావు, విజయానంద్‌లు విజ్ఞప్తి చేస్తున్నారు.

శ్రీవారి ఆలయంలో మరో 100 సీసీ కెమెరాలు

ఏర్పాటుకు ట్రస్టుబోర్డు ఆమోదం



శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సమావేశాన్ని నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ సుధాకరరావు

ద్వారకాతిరుమల : శ్రీవారి ఆలయ భద్రతలో భాగంగా క్షేత్రంలో మరో వంద సీసీ కెమెరాల ఏర్పాటుకు ట్రస్టుబోర్డు ఆమోద ముద్ర వేసినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు గురువారం తెలిపారు. ఆలయ చైర్మన్ ఎస్వీ.సుధాకరరావు అధ్యక్షతన బుధవారం జరిగిన నూతన ట్రస్టుబోర్డు తొలి సమావేశ వివరాలను ఈఓ విలేకర్లకు వివరించారు. 2023–2024 ఆర్థిక సంవత్సరానికి ప్రధాన ఆలయానికి రూ.135 కోట్ల బడ్జెట్, ట్రస్టులకు మరో రూ. 20 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెల ఆదాయ, వ్యయాలను, కేంద్రీయ గిడ్డంగులకు అవసరమైన ఆవు నెయ్యి, వస్త్రాలు, తదితర టెండర్లను, దేవస్థానం భద్రతా చర్యల్లో భాగంగా 100 సీసీ కెమేరాల ఏర్పాటుకు టెండరును ఆమోదించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా రూ. 2.72 కోట్లతో క్షేత్ర ఉపాలయమైన శివాలయం వద్ద గోపురం, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సంబంధించిన టెండర్‌ను, సుమారు రూ.4.50 కోట్లతో చేపట్టనున్న మరో 34 అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు రూ.9.82 లక్షల ఆదాయం

పెదవేగి : రాట్నాలకుంటలోని శ్రీ రాట్నాలమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. 84 రోజులకు గాను వచ్చిన రూ 9,82,735 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని ఏలూరు తనిఖీదారు బాలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు గరికిముక్కు సర్వేశ్వరరావు, పాకలపాటి వెంకటేశ్వరరావు, మేరుగు వెంకటేశ్వరరావు, నంబూరి జనార్ధనరావు, నాగార్జున లక్ష్మీరాధిక, ఈదా ధర్మారావు, కట్టా నాగరాజు, లింగాల కనకారావు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోంగార్డుల కుటుంబాలకు అండగా..



హోంగార్డు రత్నబాబు సతీమణి విజయమ్మకు ఆర్థిక సహాయం అందజేస్తోన్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా హోంగార్డుల సంక్షేమానికి, వారి కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటామని జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఏలూరు జిల్లా హోంగార్డు యూనిట్‌లో పనిచేసి పదవీవిరమణ చేసిన ఎస్ఏ కరీంకు రూ. 5.48 లక్షల సహాయాన్ని అందజేశారు. అనారోగ్యంతో 2021లో మృతిచెందిన హోంగార్డు కత్తుల రత్నబాబు సతీమణి విజయమ్మకు రూ.5.51 లక్షల సాయాన్ని చెక్కు రూపంలో ఎస్పీ అందజేశారు. వీరిద్దరికీ హోంగార్డు సంక్షేమ నిధి నుంచి సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డుల కుటుంబాలు ఎవరైనా తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

క్లుప్తంగా

కొండేపాడులో భారీ అన్నసమారాధన


కొండేపాడు కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన దృశ్యం

పెంటపాడు: మండలంలోని బి. కొండేపాడు గ్రామ దేవత కనకదుర్గమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మీనవిల్లూరు, చింతపల్లి, కోరిమిల్లి, రామచంద్రపురం, తిరుపతిపురం గ్రామాలకు చెందిన సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కోరిమిల్లి సొసైటీ కమిటీ సభ్యుడు దేవరశెట్టి రాంబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాలా గణపతి, సర్పంచ్ కట్టా దానయ్య, ఎమ్పీటీసీ సభ్యుడు సత్యనారాయణలు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర


విశేష అలంకరణలో శ్రీపోలేరమ్మ అమ్మవారు

అత్తిలి: ఉగాది పర్వదినం సందర్భంగా ఉరదాళ్లపాలెం గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని పుష్పాలతో విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. ఆసాదుల గరగనృత్యాలు, డప్పువాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని, మొక్కులను తీర్చుకున్నారు.

ఈవో సత్యనారాయణకు ఉగాది పురస్కారం


మంత్రి కొట్టు సత్యనారాయణ నుంచి అవార్డు అందుకున్న సత్యనారాయణ

తణుకు అర్బన్: తణుకు వెంకటేశ్వరస్వామి, దువ్వ దానేశ్వరి అమ్మవారి ఆలయాల ఈవో ముత్యాల సత్యనారాయణకు ప్రభుత్వం నుంచి అవార్డు దక్కింది. ఉగాది పురస్కారాల్లో భాగంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం తాడేపల్లిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రీజనల్ జాయింట్ కమిషనర్ సురేష్‌బాబు, డిప్యూటీ కమిషనర్ విజయరాజుల చేతులమీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. విధుల్లో భాగంగా ఆలయాల నిర్మాణాలు, సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డు అందుకున్నట్లు సత్యనారాయణ తెలిపారు.

లయన్స్‌క్లబ్ గవర్నర్ పదవి కోసం నామినేషన్ దాఖలు


నామినేషన్ పత్రం గట్టిం మాణిక్యాలరావు ఆధ్వర్యంలో అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ 316 జిల్లా గవర్నర్‌గా ఎన్నిక కావడం కోసం తాడేపల్లిగూడెం స్పిరిట్ ఫౌండర్ గట్టిం మాణిక్యాలరావు గురువారం ఆకివీడు వెళ్లి నామినేషన్ వేశారు. తాడేపల్లిగూడెం పట్టణం నుంచి 25 కార్లుతో ఊరేగింపుగా తరలివెళ్లి ఎలక్షన్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలు సమర్పించారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం, డైమండ్స్, స్పిరిట్ క్లబ్ సభ్యులు సన్నిధి సూర్యనారాయణమూర్తి, కోనా హనుమాన్, నూకల జయభారతి, వట్టిప్రోలు రాము, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సభ్యులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను పరిరక్షించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పత్రికా స్వేచ్ఛను పరిరక్షించుకోవాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ పేర్కొన్నారు. గురువారం తాడేపల్లిగూడెం భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో సేవ్ జర్నలిజం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథరెడ్డి మృతికి సంతాపం తెలిపారు. భగత్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

తణుకు టౌన్: స్వాతంత్ర్య సమర యోధుడు, సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సేవ్ జర్నలిజం డే కార్యక్రమాన్ని తణుకు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

చక్కగా చదివారు.. కొలువులు కొట్టారు

తాడేపల్లిగూడెం : ఉద్యానకళాశాల అధ్యాపకుల మార్గనిర్దేశనం విద్యార్థులకు కలిసివచ్చింది. గురువులు చూపించిన మార్గంలో చక్కగా చదివిన విద్యార్థులు సర్కారీ కొలువులు కొట్టారు. విద్యతో పాటు ఉద్యోగం సాధించడానికి కావాల్సిన పరిజ్ఞానం విద్యార్థులకు ఉద్యాన కళాశాలలో అందింది. ఏపీపీఎస్సీ నిర్వహించిన ఉద్యాన అధికారుల పోస్టులను ఎంచక్కా వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాల , అనుబంధ కళాశాల విద్యార్థులు పదిమంది కైవసం చేసుకున్నారు. సర్కారీ కొలువు సాధించిన వెంకట్రామన్నగూడెం విద్యార్థులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. చదివిన కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ యం.మాధవి, యుజీ.అకడమిక్ డీన్ డాక్టర్ టి.సుశీల, పి..జీ.అకడమిక్ డాక్టర్ ఎం.కల్పనలు ఉద్యాన అధికారులుగా ఉద్యోగ బాధ్యతలు తీసుకొనే ఇక్కడి విద్యార్థులు ఉద్యాన సమస్యలను పరిష్కరిస్తూ, నూతన సాంకేతిక విషయాలను తెలుసుకుంటూ, రైతులకు సాయం చేస్తూ ఉద్యాన కళాశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉద్యోగాలు పొందిన ఇక్కడి విద్యార్థులు పదిమంది తమ అభిప్రాయాలను సంతోషంతో పంచుకున్నారు.


ఉద్యోగాలు పొందిన వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

రైతులకు సేవ చేసే భాగ్యం దక్కింది


ఉద్యానవర్సిటీలో పోటీపరీక్షల కోసం నిర్వహించే అవగాహన కార్యక్రమాలు అక్కరకు వచ్చాయి. ప్రొఫెసర్స్‌తో పాటు నా కుటుంబ సభ్యులు, నా భర్త, స్నేహితుల ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించగలిగాను. రైతులకు సేవ చేసే భాగ్యం కలగడం ఆనందంగా ఉంది. – కె.జ్యోతి ప్రియాంక

హార్టీ కల్చర్ వృత్తి విద్యాకోర్సు బాగుంది


హార్టీకల్చర్ వృత్తి విద్యాకోర్సు చేయడం కలిసివచ్చింది.ప్రభుత్వ ఉద్యోగం పొందడంలో కళాశాల అధ్యాపకుల ప్రోత్సాహానికి, నా కృషి కలిసివచ్చింది. తల్లితండ్రులు అందించిన నిరంతర ప్రోత్సాహం వల్ల ఉద్యాన అధికారిగా రైతులకు సేవ చేసే భాగ్యం కలిగింది. – ఆర్.నవీన మణిమాల

కోచింగ్ కలిసి వచ్చింది


బీఎస్సీ హార్టీ కల్చర్ వెంకట్రామన్నగూడెంలో చదివా. తర్వాత కర్నూలులో కోచింగ్ తీసుకున్నాను. ఇది నాకు ఎంతగానో ఉపయోగపడింది. ఉద్యోగం వచ్చినందుకు సంతోషంగా ఉంది. – టి.ధీరజ్ లక్ష్మణ్

కళాశాల వాతావరణం కలిసొచ్చింది


వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాల వాతావరణం చదువుతో పాటు, ఉద్యోగాల కోసం తయారయ్యే వాతావరణం కల్పించింది. ఇది నాకు కలిసివచ్చింది.ఉద్యోగం వచ్చింది. కళాశాల బృందం అందించిన ప్రోత్సాహం మరువలేనిది. – డాక్టర్ జి.కోటేశ్వరరావు

ఉద్యాన వర్సిటీలో చదవడం వల్లే


ప్రఖ్యాత వైఎస్ఆర్ ఉద్యానవర్సిటీలో చదవడం వల్లే ఉద్యోగం పొందగలిగా. ఇక్కడి ఉద్యాన కళాశాల టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది గైడెన్సు బాగుంది. ఉద్యోగం సాధించాలనే తపన, పట్టుదల, దేవుని దయతో ఉద్యోగం సంపాదించాను. – యస్.మానస

వర్సిటీ పరిధిలోనే ఉద్యోగం సంతోషం


చదివిన కళాశాల ఉన్న ఉద్యానవర్సిటీ పరిధిలోనే జోన్‌టులో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. స్టూడెంట్ ఇన్‌చార్జిగా ఉన్న సుబ్బరావమ్మ, ఇతర సిబ్బంది అందించిన ప్రోత్సాహం కూడా ఒక కారణం. దేవుని దయకూడా కలిసివచ్చింది. – జల్లి కీర్తిదేవ్

తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేను


చదివి, ఉద్యోగం పొందే విషయంలో తల్లి తండ్రుల ప్రోత్సాహం మరువలేను. బీఎస్సీ, ఎంఎస్సీ హార్టీకల్చర్ చదివే సమయంలో వీఆర్‌గూడెం ఉద్యాన కళాశాల అందించిన ప్రోత్సాహం గుర్తుంచుకోదగింది. – మహ్మద్ సాఫియా ఫరీనా

రైతు కుటుంబం నుంచి వచ్చి


రైతు కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి రైతులకు సేవ చేసే ఉద్యోగం పొందడం ఆనందంగా ఉంది. ఉద్యానకళాశాల ప్రొఫెసర్సు సహకారం, సూచనలు మరువలేను. – ప.నాగశ్రీదేవి

ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు


ఉద్యానకళాశాలలో ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రోత్సాహంతో ఉద్యోగం పొందా. నా విజయానికి కారణం, తల్లితండ్రులు, ఉపాధ్యాయులే. రైతులకు విశేష సేవలందిస్తా. – పి.జయశ్రీ

ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌కు అభినందనలు


తేతలిలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన తణుకు పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త వంకా రవీంద్రనాథ్‌ను తణుకు లేత్ అండ్ ఆర్క్ వెల్డింగ్, డిజైన్ వర్క్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించి అభినందనలు తెలిపారు. గురువారం తేతలి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని తన కార్యాలయంలో లేత్ అండ్ ఆర్క్ వెల్డింగ్, డిజైన్ వర్క్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కలసి శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం సురేష్, కార్యదర్శి కె చంద్రన్న, గౌరవ అధ్యక్షుడు కే శ్రీనివాసరావు, కోశాధికారి పీ రాజు, మాజీ కౌన్సిలర్ అప్పారావు, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తణుకు: తణుకు ఐసీడీఎస్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో ఎంబీఎస్ ప్రమోదకుమారి తెలిపారు. జంగం చెరువు (ఓపెన్), పాలూరు-2 (ఎస్సీ), వెంకట్రాయపురం (ఓపెన్) కేటగిరీల్లో అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు కె.కుముదవల్లి (ఓపెన్), పాలూరు-3 (ఎస్సీ), అయితంపూడి (ఓపెన్), స్కిన్నెరపురం (బీసీ-ఎ), పాత శివాలయం వీధి (ఓపెన్) కేటగిరీల్లో అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అభ్యర్థులు స్థానికులై వివాహిత మహిళలు అయి ఉండాలని కనీస విద్యార్హత పదోతరగతి ఉత్తీర్ణత పొందాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 29 సాయంత్రం 5 గంటల లోపు తణుకు ఎంపీడీవో కార్యాలయంలోని దరఖాస్తులు అందజేయాలని కోరారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పోస్టులకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు సీడీపీఓ టీఎల్ సరస్వతి పేర్కొన్నారు. పట్టణంలో గురువారం వివరాలను వెల్లడించారు. కార్యకర్తలకు సంబంధించి తాడేపల్లిగూడెంలో 5వ వార్డులో ఓపెన్ కేటగిరి, రూరల్ మండలంలోని గొల్లగూడెం ఓపెన్ కేటగిరి అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అంగన్వాడీ సహాయకులకు సంబంధించి తాడేపల్లిగూడెం 11వ వార్డు ఓపెన్ కేటగిరి, 31వ వార్డు బీసీ.ఇ కేటగిరి, ముదునూరు-2లో ఎస్సీకేటగిరి, మీన వల్లూరు-2లో బీసీ.బి కేటగిరి అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. అన్ని పత్రాలతో ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు గణపవరంలోని మండల పరిషత్ ఆఫీస్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

దళిత యువకుడి హత్యకు నిరసన

తణుకు టౌన్: కాకినాడ జిల్లా శృంగవృక్షం గ్రామంలో దళితవాడపై దాడి చేసి యువకుడిని హత్య చేసిన కుల దురహంకారులను కఠినంగా శిక్షించాలని సామాజిక న్యాయ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.న్యాయ పోరాట సమితి వ్యవస్థాపకుడు పేరూరి మురళీకుమార్ మాట్లాడుతూ అగ్రవర్ణాల దాడిలో దళిత యువకుడు నడిపల్లి రాము దారుణంగా హత్యకు గురికాగా, మరి కొంత మంది తీవ్రంగా గాయపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు జీ అంబేద్కర్, బాతు వేణు గోపాల్, జిల్లా అధ్యక్షుడు వై రవీంద్ర, న్యాయవాదులు కుసుమ యాకోబురాజు, రాపాక ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న సామాజిక న్యాయ పోరాట సమితి నాయకులు

మాగుడు తెగులు నివారణ చర్యలు చేపట్టాలి

తాడేపల్లిగూడెం రూరల్: వరిలో మాగుడు తెగులు అధికంగా ఉందని, దీని నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆర్ ఎస్.ప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం, మోదుగ గుంట గ్రామాల్లోని వరి చేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ యూరియా అధికంగా వాడటం, రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వంటి కారణాలతో మాగుడు తెగులు వస్తుందన్నారు. దీని నివారణకు హెక్సాకొనజోల్ రెండు మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు నందిని, మౌనిక, సురేష్, రైతులు సత్యనారాయణ, ప్రసాద్ ఉన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ


కంబాల మంగరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శిగా పని చేసిన, రిటైర్డ్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మేనేజర్ కంబాల మంగరాజు మృతి పట్ల ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం తణుకులోని హౌసింగ్ బోర్డు కాలనీలో మంగరాజు నివాసంలో ఆయన కుమారుడు కంబాల వీరభద్రరావు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేజీ అప్పారావు, పైబోయిన ఏసుబాబు, చిట్టాల రంగారావు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాల సందర్భంగా సత్కారాలు


రామకృష్ణ శర్మను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉగాది మహోత్సవాలను పురస్కరించుకొని గురువారం పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో సుందరకాండ పారాయణం, ప్రవచనాలు అందించిన బ్రహ్మశ్రీ తల్లాప్రగడ రామకృష్ణ శర్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్ వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు, గ్రంధి సత్యనారాయణ, ప్రముఖ వ్యాపారవేత్త నంద్యాల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు నియోజకవర్గంలో ఎనిమిది కేంద్రాల్లో గురువారం ప్రశాంతంగా జరిగాయి. లెక్కలు-1, జూవాలజీ-1, ఎకనామిక్స్-1 పరీక్షలు జరిగాయి. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 2,323 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 2,245 మంది పరీక్షలు రాశారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఇరగవరం: మండలంలోని ఖాళీగా ఉన్నా అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని తణుకు ప్రమోదీని కూమారి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి తెలిపారు. కెకుమదవల్లి,అయితంపూడి (జనరల్), కంతేరు(ఎస్సీ), దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 29వ తేది సాయంత్రం ఐసీడీఎస్ కార్యాలయంలో ధృవపత్రాలు అందించాలని కోరారు.

సాంకేతిక సదస్సులతో అవగాహన మెరుగు

తాడేపల్లిగూడెం: సాంకేతికత సింపోజియంలలో విద్యార్థులు పాల్గొనడం వల్ల వారిలో దాగి ఉన్న సృజనాత్మకత బయటపడుతుందని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి అన్నారు. వాసవీలో మూడు రోజుల సాంకేతిక పండుగ టెక్ యుఫోరియా 2కె23ను గురువారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ, నాయకత్వ లక్షణాలు బహిర్గతం చేసుకోడానికి ఇలాంటి వేదికలు ఉపయోగపడతాయన్నారు. నిట్ డీన్ డాక్టర్ ఎన్.జయరామ్ మాట్లాడుతూ వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఒక చోటకు చేరి తమ పరిజ్ఞానాన్ని పదిమందితో పంచుకుంటే వారు మరింతగా ఎదగడానికి దోహదం చేస్తుందన్నారు. ఏపీ నిట్ సాంకేతిక సహకారంతో సాంకేతిక ప్రాజెక్టులకు పేటెంట్‌ల కోసం వివిధ సంస్థలకు దరఖాస్తు చేశామని ప్రిన్సిపాల్ రత్నాకర్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, టెక్ యుఫోరియా కోఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు, డి.నవీన్ తదితరులు మాట్లాడారు. విద్యార్థులు తయారు చేసిన ఆకృతులు, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


టెక్ యుఫోరియాను ప్రారంభిస్తున్న ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్, శంకరరెడ్డి

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

పెంటపాడు: వరిచేలో తెగిపడిన విద్యుత్ తీగపై ప్రమదవశాత్తూ కాలువేయడంతో కౌలు రైతు మృతి చెందాడు. పెంటపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కునాకరపేటకు చెందిన తాడి దానిరెడ్డి(59) గ్రామ శివారులోకి ద్వారంపూడి కాశీరెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రాన్ని మూడేళ్లుగా కౌలుకి సాగుచేస్తున్నాడు. అయితే పొలం పనుల నిమిత్తం వరిచేనుకు నీరు పెట్టేందుకు దానిరెడ్డి బుధవారం రాత్రి పొలంకు వెళ్లాడు. ఇటీవల కురిసిన ఈదురు గాలులు, వర్షానికి దానిరెడ్డి కౌలుకు చేస్తున్న పొలం మీదుగా వెళ్లిన ఎల్‌టీ విద్యుత్ లైను తీగ తెగి వరి చేలో పడింది. ఆ విషయం గమనించని దానిరెడ్డి చేలకు నీరుపెట్టే క్రమంలో వైరు ఈతనికి తాకింది. దీంతో అతను విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారినా ఎంతకీ దానిరెడ్డి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతని ఆచూకీ కోసం పొలంలో గాలించారు. అక్కడ విగతజీవిగా పడిఉన్న దానిరెడ్డిని చూసి బోరున విలపించారు. స్థానికుల సూచనతో ఈతనిని గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు కూడా సమాచారం ఇవ్వడంతో ఎస్సై జి. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏఎస్సై కొప్పిశెట్టి సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన దానిరెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


తాడి దానిరెడ్డి (59) ఫైల్‌ఫోటో

పోషకాహారంతోనే ఆరోగ్యం

అత్తిలి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అందిస్తున్నారని హెల్త్ అసిస్టెంట్ వేణుగోపాలస్వామి చెప్పారు. అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ 7 నెలల నుంచి మూడేళ్ల వయస్సు గల చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యంగా ఐసీడీఎస్ ద్వారా బాలామృతాన్ని అందజేస్తున్నారన్నారు. బాలామృతంలో గోధుమలు, శనగపప్పు, పాలపొడి, నూనె, పంచదార వంటి పదార్థాలు ఉంటాయని తెలిపారు. పిల్లలకు రోజువారి పోషక అవసరాలలో 50శాతం ఐరన్, కాల్షియం, విటమిన్లు దీనిద్వారా లభిస్తుందని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, వీఎల్ఎన్ కుమారి, సంధి విజయకుమారి, తానేటి వరలక్ష్మి, గుబ్బల విజయవాణి, ఆశ కార్యకర్తలు రేణుక తదితరులు పాల్గొన్నారు.


ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో మాట్లాడుతున్న హెల్త్ అసిస్టెంట్

మిల్లెట్స్‌తో గర్భవతులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం

తణుకు టౌన్: శిశు రక్షణతో పాటు ఆరోగ్యకర దేశ నిర్మాణం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం అరుణ కుమారి చెప్పారు. గురువారం తణుకులోని 27వ వార్డులో గల అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

29 నుంచి భైరాగిమఠంలో శ్రీరామనవమి వేడుకలు

పెంటపాడు: మండలంలోని కె. పెంటపాడు భైరాగిమఠంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో నియోజకవర్గంలోనే భారీ స్థాయిలో ఈనెల 29 సాయంత్రం నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఆలయంలో ఐదు రోజుల పాటు భారీగా నిర్వహించే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను ఈవో చీమలకొండ సాయి, సూపరెండెంట్ కొండవీటి నాగబాబులు పరిశీలించారు. స్వామివారి కల్యాణం జరిగే ప్రాంతంలో చలువ పందిళ్లు వేశారు. ఆలయం చుట్టుపక్కల పందిళ్లు, విద్యుత్ కటౌట్‌లు ఏర్పాటు చేశారు. ఈనెల 29న సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో 29న సాయంత్రం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, వాస్తుపూజ, నవగ్రహమండపారాధన, అంకురార్పణ, భేరీ పూజ, ధ్వజారోహణ, బలిహరణ, అగ్ని ప్రతిష్ఠాపన, హోమాలు, కల్యాణ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ఆలయ ఫిట్‌పర్సన్ చీమలకొండ సాయి తెలిపారు. 30న స్వామివారి కల్యాణం పురస్కరించుకొని నిత్యార్చనలు, విశేషపూజలు, నిత్యహోమాలు అనంతరం ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ దంపతులతో స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం అనంతరం 12 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు సాయి తెలిపారు. అనంతరం తీర్థప్రసాద గోష్టి, కె. పెంటపాడు వేణుగోపాల స్వామి భజనమండలితో కోలాటం, మధ్యాహ్నం 1 గంటకు అఖండ అన్నసమారాధన, రాత్రి ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం రాత్రి 9 గంటలకు బాణసంచా, బ్యాండ్‌మేళాలతో స్వామివారికి గరుడవాహన సేవ, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి జరగబోయే ఈ కార్యక్రమాలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆలయఫిట్ పర్సన్ సాయి కోరారు. దూరప్రాంత నుంచి వచ్చే భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.


ఉత్సవాలకు సిద్ధం చేస్తున్న వేణుగోపాలస్వామి ఆలయం